## రెవెన్యూ సదస్సులకు 43 దరఖాస్తులు



చింతకుంట గ్రామ రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేస్తుకుంటున్న రైతులు

ధారూరు, మే 12: మండల పరిధిలోని ఎబ్బనూరు, హరిదాస్‌పల్లి, చింతకుంట గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులకు మొత్తం 43 దరఖాస్తులు వచ్చినట్లు ధారూరు తహసీల్దార్ సాజిదాబేగం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు అనిల్‌బాబు, ప్రకాష్ , శ్రీహరి , గోవర్ధన్, శ్వే, ఎంపి హనుమంతు, శ్రీనివాస్, విజయేందర్, నరేందర్, సాయికిరణ్, మాధవరెడ్డి, నరేష్, జగదీష్,దీపక్ సంసాన్ , మహేష్, రవికిషోర్, స్వప్న, శ్రీనివాస్, మర్పల్లి, శివయ్య, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. మంగళవారం దోర్నాల్, గురుదోట్ల,కుమ్మరిపల్లి గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అమర సైనికులకు నివాళులు..



కులకచర్ల, మే 12 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో భాగంగా సోమవారం రామలింగేశ్వరస్వామి కమాన్ దగ్గర ముందుగా ఆపరేషన్ సింధూరులో అమరులైన భారత సైనికులకు నివాళులర్పించారు. అనంతరం హిందూ ధ్వజాన్ని ఎగురవేసి భక్తులు గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని చేపట్టారు. పౌర్ణమి సందర్భంగా నిర్వహించే గిరిప్రదక్షిణకు కులకచర్ల మండలంతో పాటు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో పాల్గొన్నారు. గిరిప్రదక్షిణ అనంతరం భక్తులు రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ప్రారంభం ఆర్భాటం..వసతుల కల్పన గాలికి


▪ బంట్వారం మేకల సంతలో అన్నీ సమస్యలే ▪ మూగజీవాల వేదన అరణ్య రోదనే



మేకల సంతలో ఎండలోనే కొనసాగుతున్న లావాదేవీలు

బంట్వారం, మే 12: మండల కేంద్రంలో మూడు నెలల క్రితం ఎంతో ఆర్భాటంగా కొత్తగా మేకల సంతను ప్రారంభించారు. ప్రారంభ సమయంలో మార్కెట్‌ను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని, రైతులు ఇదే సంతకు మేకలను తీసుకరావాలని ఊదరగొట్టారు. రైతులకు అల్పాహారం, మేకలకు మేత, నీళ్లు అన్ని ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పారు. తీరా నేడు అవేమి పట్టించుకోకుండా కాలం గడిపేస్తున్నారు. కనిష్టంగా మేకలు నిలబడలాన్న నీడ లేదు. స్థలం మొత్తం గుంతలు పడి, ఎత్తుపల్లాలుగా ఉంది. ప్రారంభించిన నెల రోజుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని నాడు ప్రారంభోత్సవ సభలో చైర్మన్ మహేందర్‌రెడ్డి హామి ఇచ్చారు. ఇప్పటికి మూడు నెలలు గడుస్తున్నా అటు వైపే చూడకుండా కాలం వెల్లదీస్తున్నారు. సంత స్థలం మొత్తం గుంతలు, ఎత్తు పల్లాలతో కూడి ఉంది. దాన్ని కనిష్టంగా లెవలింగ్ చేయ లేదు. మేకలు సంతలోకి వస్తే తాగించేందుకు నీళ్ల సౌకర్యం ఏర్పాటు చేయ లేదు. మరో వైపు ఏమి కనీస వసతులు కల్పించకుండానే సంతలో మేకలను అమ్ముకోవడానికి ఒక్కొక్క మేకకు యాభై రూపాయలు ఫీజు వసూలు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### చైర్మన్‌కు విన్నవించాం



సంతలో అనేక సమస్యలు ఉన్నాయి. వీటి పరిష్కారం కొరకు ఇప్పటికే ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి వివరించాం.త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. ప్రస్తుతం నీటి సౌకర్యం కల్పించేందుకు కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయి. ఇవే కాక మార్కెట్ స్థలం లెవలింగ్ చేయడం, కంపౌండ్ నిర్మాణం తదితర సమస్యలు పరిష్కరించే విషయమై కమిటీ దృష్టికి తీసుకెళ్తాం

**- పి. యాదగిరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బంట్వారం**

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వికారాబాద్, మే 12 : మోమిన్ పేట 1999-2000 పదవ తరగతి విద్యార్థుల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల అనంతరం పాఠశాలలో చదువుకున్న విద్యార్థులంతా ఒకచోట కలిసిన సందర్భం అనిర్వచనీయం. పాత మిత్రులందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆనందంగా పాతరోజులు గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను సత్కరించి, పాదాభివందనాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారన్ రెడ్డి, వెంకట య్య, బక్కయ్య, మనోహర్, రిజ్వానా బేగం, జనార్ధన్, రుక్మయ్య, రమేశ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, మల్లేశం, పూర్వ విద్యార్థులు డి వెంకన్న, రవి, శ్రీనివాస్, ప్రభయ్య, శ్రీకాంత్, నాగయ్య, శివకుమార్, ప్రశాంత్, దేవకుమార్, కాంతారావు, శేఖర్, ఫసీయుద్దిన్, కృష్ణ పాల్గొన్నారు.

## ఆర్జిత సెలవులు మంజూరు చేయాలి

బొంరాస్‌పేట్,మే 12: ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు వికారాబాద్ జిల్లా కేంద్రంలో విడతల వారీగా నిర్వహించను న్నట్లు తపస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య తెలిపారు. రాష్ట్రప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరం నుంచి గుణాత్మకమైన విద్యను అందించడంలో భాగంగా ఉపాధ్యాయులకు వేసవి సెలవులలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ నెల 13 నుంచి విడతల వారిగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేసవి సెలవులలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం వలన వేకేషన్ పీరియడ్ సెలవులను ఉపాధ్యాయులు నష్టపోయే ఆవకాశం ఉందని ఈ సమయంలో తమకు ప్రభుత్వం ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## సీసీ రోడ్డు వేశారు.. మట్టి వేయడం మరిచారు



కల్‌ఖోడాలో సైడ్‌లకు మట్టి లేకుండా ఉన్న సీసీ రోడ్డు

మర్పల్లి, మే 12: మండలంలోని కల్‌ఖోడా, కుడుగుంట, షాపూర్, దామస్తాపూర్ గ్రామాల్లో ఆరు నెలల క్రితం ఎంఆర్‌ఆర్ నిధులతో సీసీ రోడ్లు వేశారు.. కానీ సైడ్‌లకు మట్టి వేయకుండా వదిలేశారు.. దీంతో ఆ గ్రామాలకు వెళ్లే ప్రజలు, వాహనదారులు, స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి సీసీ రోడ్డు సైడ్‌లకు మట్టి వేసి రాకపోకలకు సౌకర్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు..

## రూ.2లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేయాలి



ఆర్‌డీవో వాసుచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న అందె విజయకుమార్

పరిగి, మే 12: ప్రతి రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు అందె విజయకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పరిగిలో ఆర్‌డీవో వాసుచంద్రకు ఆయన వినతిపత్రం అందజేశారు. రైతు భరోసా కింద పెట్టుబడి సహాయాన్ని 10 ఎకరాల లోపు రైతులందరికీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఇంకా 40 శాతం రుణమాఫీ, రైతు భరోసా మిగిలి ఉందని, వారం దరికీ అమలు చేయాలని పేర్కొన్నారు. రుణమాఫీ కాలేకపోవడంతో ఎన్‌పీఏ కింద మారి రైతుకు అప్పు పుట్టని పరిస్థితి ఏర్పడుతుందని, తద్వారా ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడి నష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

## క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేత



కులకచర్ల, మే 12: గత రెండు రోజులుగా శివాజీ క్రికెట్ క్లబ్ ఆద్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగియగా విజేతలకు గ్రామ ప్రముఖులు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతికి కుమ్మరి స్వామి రూ. 10000, బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్ రెండవ బహుమతికి నగదు అందిం చారు. మేకల రామస్వామి సెంట్రింగ్ వ్యాపారి విజేతలకు షీల్డ్‌లను అందజేశారు. డబల్ వికెట్ క్రికెట్ టోర్నమెంటును నిర్వ హించారు. ఇందులో విజేతలుగా నిలిచిన విన్నర్‌గా బోట్ల రమేశ్‌నాయక్ పోలీస్-రాజ్‌కుమార్ జట్టుకు, రన్నర్‌గా నిలిచిన గుడాల రమేశ్-రవి టీంకు నగదుతో పాటు, ట్రోఫీలను అందజేసి క్రీడాకారులకు సుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదె మహిపాల్, మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్, సీనియర్ క్రీడాకారులు మురళి, గాదె వెంకటేశ్, తిరుపతి, నరేశ్, అండి ప్రవీణ్‌కుమార్, బాలు, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

## మురికిమయం.. మున్నూరు సోమారం

ధారూరు, మే 12: మండల పరిధిలోని మున్నూరు సోమారం గ్రామం 'పల్లె చిన్నది... సమస్యలు బోలెడు' అన్నట్టుగా ఉంది. మురుగు కాలువలు శుభ్రం చేయక దుర్వాసన వెదజల్లుతుంది. గ్రామంలో పారిశుధ్యంపై అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారంతో కూడిన వాతావరణం, రోడ్లపై పారుతున్న మురుగు నీరు ఉండటంతో గ్రామస్తులు అనుభవిస్తున్న బాధ అంత ఇంతా కాదు. రోడ్డు పక్కనే చెత్తాచెదారం, రోడ్డుపైనే పారుతున్న మురుగు నీటితో రోగాలు వచ్చే ప్రమాదం ఉందని ఎన్నోసార్లు అధికారులు, గ్రామానికి చెందిన సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లిన కూడాస్పందించకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ముఖ్యంగా సంగమేశ్వర కాలనీ, దస్తగిరిపీర్లు, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నడవలేక పోతున్నారు. ఇంటి పన్నులు బాగానే వసూలు చేస్తున్నారు కానీ మా ఇండ్ల ఎదుట మాత్రం చెత్తాచెదారం, మురుగు నీరు పారుతుండటంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నెల రోజుల నుంచి మున్నూరు సోమారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో వీధి దీపాలు లేక ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో విద్యుత్ సమస్య ఎక్కువగా ఉంది. కరెంటు ఎప్పుడు వస్తాదో, ఎప్పుడు పోతాదో తెలియని పరిస్థితి ఉంది. రాత్రి సమయంలో బయటకు పోవాలంటే ఇబ్బందులు పడవలసివస్తుంది.ఈ విషయంపై అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### నెల రోజులుగా వీధి దీపాలు లేవు..



ఎస్సీ కాలనీలో నెల రోజుల నుంచి విద్యుత్ సరఫరా సరిగా లేదు. వీధి దీపాలు వెలగడం లేదు, దానికి తోడు మురుగు కాలువలు చెత్తతో నిండి రోడ్లపై పారుతుండడంతో నడవలేకపోతున్నాం. మురుగు నీరు నిలువ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతుంది. రోడ్లపై నీరు పారుతుండడంతో దోమలు, ఈగలతో ఇబ్బంది పడుతున్నాం గ్రామంలో చెత్తాచెదారం గూర్చి ఎన్నోసార్లు చెప్పినా కూడా అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబం ధిత అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం.

**-బి. నర్సింహులు మున్నూరు సోమారం, ధారూరు**

### దుర్వాసన భరించలేకపోతున్నాం




డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా పనిచేయక రోడ్డుపై మురుగు నీరు పారు తుంది. దీనికి తోడు చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు దాంతో దుర్వాజన వెదజల్లుతుంది. దీంతో రోగాలు వచ్చే ప్రమాదం లేకపోలేదు. గ్రామ వీధుల్లో సీసీ రోడ్డు వేయడానికి రోడ్డును తవ్వారు కానీ పరమ్మతులు వదిలేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను తీర్చి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని వేడుకుంటున్నాం.

**- రాములు, మున్నూరుసోమారం గ్రామం, ధారూరు**

## నేడు కరెంటు సరఫరాకు అంతరాయం

పరిగి, మే 12: 11కేవీ నస్కల్ ఫీడర్ మెయింటెనెన్స్ పనుల వల్ల 13వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరిగి మున్సిపల్ పరిధిలోని మల్లెమొనిగూడ, నస్కల్, రుక్కుంపల్లి, మండలంలోని బర్కత్‌పల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఆర్.హరిక్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



కులకచర్ల, మే 12: మండల పరిధిలోని పటేల్‌చెరువుతండా గ్రామ పంచాయతీలో పోటిగడ్డతండాలో మాజీ సర్పంచ్ శాంతి తులసీరాం గ్రామానికి చెందిన విస్తావత్ మనోనిబాయి, చందర్ కుమార్తె సవిత వివాహానికి క్వింటాలు సోనాబియ్యం, 15కిలోల మంచినూనె అందించారు. కార్యక్రమంలో నేనావత్ లక్ష్మి, మాణిక్‌నాయక్, శంకర్, సంతోశ్, సంతోశ్, రాహుల్, లక్ష్మణ్, నితిని, అరుణ్, లక్ష్మిమాయి, నీలమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అందని పౌష్టికాహారం!

▪ ప్రభుత్వాసుపత్రుల్లో డైటీషియన్ల కొరత ▪ ఖాళీల భర్తీలో తీవ్ర జాప్యం

- నిలోఫర్, ఉస్మానియా, మెటర్నటీ ఆసుపత్రుల్లో డైట్‌పై పర్యవేక్షణ కరువు
- రోగుల ఆరోగ్యంపై తీవ్రప్రభావం

సిటీబ్యూరో/ తెలుగు యూనివర్సిటీ, మే 12,(నమస్తే తెలంగాణ): సర్కార్ దవాఖానల్లో చేరే రోగి సంరక్షణలో ప్రధాన పాత్ర పోషించే రెగ్యులర్ డైటీషియన్లు లేకపోవడం మూలానా పోషకాలు లేని తిండే గతైతోంది. జిల్లా పరిధిలోని ప్రభుత్వాసుపత్రుల్లో డైట్ ప్లాన్ క్రమపద్ధతిలో అమలు చేసే చీఫ్ డైటీషియన్, డైటీషియన్ పోస్టులు భర్తీ చేయకపోవడమే దీనికి ప్రధాన కారణం. గతంలో పనిచేసిన వారంతా ఆరునెలల క్రితం బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లగా.. ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తోందంటూ విమర్శలున్నాయి. దీంతో సరైన పోషకాలు లేని తిండి తింటూ రోగులు కోలుకోవడంలో సమయం ఎక్కువపడుతోందనే వాదనలు ఉన్నాయి.

### బీఆర్ఎస్ హయాంలో పక్కాగా అమలు..

ప్రభుత్వాసుపత్రుల్లో చేరే ఇన్‌పేషెంట్లందరికీ ఉచితంగా మూడు పూటల పోషకాలు కలిగిన ఆహారం అందించాలని గత బీఆర్ఎస్ సర్కార్ నిర్ణయించడంతో పాటు వెంటనే అమలు చేసింది. అందులో భాగంగానే వాటిలో పోషకాల శాతం, రోగి ఆరోగ్యానికి అవసరమైన ఆహారం అందించేందుకు డైటీషియన్లను నియమించారు. వైద్యులు, నర్సులతో కూడిన మల్టీడిసిప్లినరీ బృందంతో డైటీషియన్లు సమన్వయం చేసుకుంటూ నిరంతరం రోగికి కావాల్సిన పోషకాలతో కూడిన ఆహారాన్ని తగిన మోతాదులో అందించేవారు. సాధారణ వ్యాధులతో పాటు డయాబెటిస్, కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి రోగాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారికి ప్రత్యేక ఆహార నియమాలు సూచిండటం, ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవవాలనేది కూడా కుటుంబసభ్యులకు డైటీషియన్లే తెలియజేసేవారు.




### ఖాళీల భర్తీలో తీవ్ర జాప్యం..

నగరంలో ఉన్న ఉస్మానియాకు నిత్యం 3,000 మంది ఔట్ పేషెంట్లు, 1,200మంది ఇన్‌పేషెంట్లు చికిత్సకోసం వస్తుంటారు. నిలోఫర్‌లో ఔట్‌పేషెంట్లు సుమారు 1,000 మంది, ఇన్‌పేషెంట్లు 300 మంది ఉండగా కోఠి మెటర్నిటీలో నిత్యం 800 మంది ఔట్‌పేషెంట్లు, 200 మంది ఇన్‌పేషెంట్లకు వైద్య సేవలందిస్తుంటారు. ఇన్‌పేషెంట్లకు సరైన సమయంలో పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించడంలో డైటీషియన్లు కృషిచేసేవారు. ఉస్మానియా, నిలోఫర్, కోఠి మెటర్నిటీ, పేట్లబుర్జ్ ఆసుపత్రుల్లో ఉన్న చీఫ్ డైటీషియన్, డైటీషియన్లు బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లడంతో ఆ పోస్టులు భర్తీ కాకుండా ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ఇప్పటివరకు వారి స్థానంలో రెగ్యులర్ వారిని నియమించకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఉస్మానియాలో కాంట్రాక్ట్ పద్ధతిలో డైటీషయన్ నియామకం కాగా, నిలోఫర్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్ఎంవో స్థాయి అధికారులే అడపాదడపాగా పర్యవేక్షిస్తుండటం గమనార్హం.

### రోగుల అరోగ్యంపై ప్రభావం..

రెగ్యులర్ డైటీషన్లను నియమించకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. నిత్యం నాణ్యతలేని, పోషకాలు లోపించిన తిండి తింటూ మరింత అనారోగ్యానికి గురవుతున్నారు. సామాన్య రోగులకు అందించే భోజనంపై ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్ల పర్యవేక్షణ లేకపోవడం మూలానా ఇష్టానుసారంగా రోగులకు ఆహారాన్ని అందిస్తున్నారు. ఈ తిండి తింటే మరిన్ని రోజులు ఆసుపత్రిలోనే గడపాల్సి వస్తుందని భయపడి చాలా మంది రోగులు ఆ భోజనాన్ని తినకుండా చెత్తబుట్టల్లో పడేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సొంతడబ్బుతో బయటినుంచి తెప్పించుకొని తింటున్నారు. వైద్య సేవల్లో ఎంతో ప్రాముఖ్యత గాంచిన ఉస్మానియా, నిలోఫర్, ప్రభుత్వ మెటర్నిటీ వంటి ఆసుపత్రుల్లో డైటీషియన్లు లేకపోవడం మూలానా రోగుల అరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. వీలైనంత మేరకు రెగ్యులర్ చీఫ్ డైటీషియన్లు, డైటీషియన్ పోస్టులను భర్తీ చేయాలంటూ రోగుల సహాయకులు అభిప్రాయపడుతున్నారు.

## సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీ బ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ): లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా సర్వే శిక్షణకు ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో గణిత శాస్త్రం ఒక అంశంగా ఉండి కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఐటీఐ డ్రాఫ్ట్‌మన్ (సివిల్), డిప్లొమా ఇన్ సివిల్, బీటెక్ ఇన్ సివిల్ లేదా ఇతర సమానమైన విద్యార్హత కలిగి ఉండాలని చెప్పారు.అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టంచేశారు. మరిన్ని వివరాలకు జిల్లా సర్వే అధికారి వీ శ్రీరామ్ 98483 68659, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే డీ అనంతరెడ్డి 94404 38475 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## టెక్స్‌టైల్స్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీ బ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని యువతకు హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ కోర్సులో మూడేండ్ల ఉచిత శిక్షణ కోసం 'కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ' వారు దరఖాస్తులు కోరుతున్నారు. ఈ ఇనిస్టిట్యూట్ నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో ఉందని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకురాలు వీ ఇందిర సోమవారం వెల్లడించారు. అడ్మిషన్ నోటిఫికేషన్ ఏప్రిల్ మొదటి వారంలో వెలువడిందని తెలిపారు. ఏవైనా సందేహాలుంటే చేనేత, జౌళి శాఖ హైదరాబాద్ కార్యాలయంలో సంప్రదించాలని వివరాలకు 906322 5878 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## హైడ్రా ప్రజావాణికి 61 ఫిర్యాదులు

సిటీబ్యూరో, మే 12(నమస్తే తెలంగాణ): ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడాల్సిన కాలనీ సంక్షేమ సంఘాలే వాటిని కబ్జా చేస్తున్నాయని హైడ్రాకు పలు కాలనీలవాసులు ఫిర్యాదు చేశారు. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల ప్రజల నుంచి 61 ఫిర్యాదులందాయి. ఆయా ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేరుగా స్వీకరించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్ 181, 183 పరిధిలో ఉన్న సాయిలక్ష్మి లేఔట్‌లోని 1,800 గజాల పార్క్‌స్థలం కబ్జా అయ్యిందని, ఇదే కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెం 153,154,155లో కూడా దాదాపు ఐదెకరాల భూమిలో పార్కులు, రహదారులు కనిపించడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లిలోని హైదర్‌నగర్‌లోని డైమండ్ హిల్స్ కాలనీలో 9ఎకరాల విస్తీర్ణంలో 70 రెసిడెన్షియల్ ప్లాట్లతో ఉన్న లేఔట్‌ను మొత్తం చెరిపేసి కబ్జాదారులు తమ స్వాధీనంలోకి తీసుకున్నారని ప్లాట్ల యజమానులు ఆరోపించారు. 2024లో హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా వారిని ఖాళీ చేయించలేకపోతున్నామని వారు వాపోయారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తూముకుంట మున్సిపాలిటీలోని దేవరయాంజల్ గ్రామంలో జాతీయ రహదారితో పాటు ఓఆర్‌ఆర్‌ను కలుపుతూ రహదారికి అడ్డంగా ప్రహరీ నిర్మించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. హయత్‌నగర్ అనుమగల్‌లోని తిరుమల హౌసింగ్ కాలనీలోని 2,955 గజాల జీహెచ్ఎంసీ పార్కును కొంతమంది వ్యక్తులు కబ్జా చేశారని, బాచుపల్లి మండలం నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని తుర్కచెరువులో ఎఫ్‌టీఎల్‌తో పాటు అక్కడ ఉన్న ప్రభుత్వస్థలాలు కబ్జా చేస్తున్నారని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.


మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి
తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962